

గోపాల్‌పేటలో పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

# ఆంగ్ల మాధ్యమంలో బోధించాలి

- వనపర్తి జిల్లా కల్టెకర్ ఆదర్శ్ సురభి

గోపాల్‌పేట, జూన్ 20 : అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తప్పనిసరిగా ఆంగ్ల మాధ్యమంలో బోధించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి పేర్కొన్నారు. గురువారం ఆయన మండలంలో పర్యటించి మిషన్ భగీరథ నల్లాల ఇంటింటి సర్వే, అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతి, పీహెచ్‌సీని తనిఖీ చేశారు. పాఠశాలలో నలుగురు ఉపాధ్యాయులు ఉండి కేవలం 20మంది విద్యార్థులు మాత్ర మే ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నమోదు తక్కువగా కావడానికి కారణం తల్లిదండ్రులను అడుగగా వారు పిల్లలను ఆంగ్ల మాధ్యమంలో చదివించడానికి కాన్వెంట్‌కు పంపిస్తున్నారని సమాధానం ఇచ్చారు. ఈ విషయమై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధించాలని సర్క్యులర్ వచ్చినప్పటికీ ఇంకా అక్కడ తెలుగులోనే బోధించడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు సిద్ధం కావాలన్నారు. అనంతరం ఆయన స్థానిక ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అక్కడ కేవలం 14 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారని తెలియడంతో కలెక్టర్ విస్మయం చెందారు. అన్ని సౌకర్యాలు కల్పించి ఆంగ్ల మాధ్యమంలో బోధించినా విద్యార్థుల నమోదు శాతం తక్కువగా ఉండటంపై ఎంఈవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వైద్యశాలను సందర్శించిన ఆయన అక్కడ పనిచేస్తున్న వైద్య సిబ్బంది, నర్సులు ఇతర సిబ్బందిపై ఆరా తీశారు. వైద్యసేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట జెడ్పీ సీఈవో యాదయ్య, డీఎల్‌పీవో రఘునాథ్‌రెడ్డి, ఉన్నారు.



గోపాల్‌పేట పీహెచ్‌సీని పరిశీలిస్తున్న కలెక్టర్

# జాడలేని వాన..

- ఆందోళనలో రైతన్న
- జిల్లాలో చాలా వరకు భూమిలోపలే విత్తనాలు
- అక్కడక్కడ వాడిపోతున్న మొలకలు



వర్షాలు లేక స్ప్రింక్లర్లతో మొక్కజొన్న పంటకు నీటితడి పెడుతున్న రైతులు

జడ్చర్ల, జూన్ 20: యాసంగి సాగుకు వరుణుడు కరుణించడం లేదు. ఈసారి వర్షాలు సీజన్‌కు ముందే రోహిణి కార్తెలోనే మొదలయ్యాయి. ముడు, నాలుగు రోజుల పాటు కురవడంతో మెట్ట రైతులు పత్తి, మొక్కజొన్న, జొన్న, కంది, ఆముదం తదితర విత్తనాలు వేశారు. అనంతరం 15రోజులు గడుస్తున్నా వాన జాడలేకపోవడంతో రైతన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పోసప్పో జేసి విత్తనాలు తెచ్చి వేశాము.. పదును ఉన్నచోట మొలకలు వచ్చాయి. లేనిచోట విత్తనం భూమిలోపలే ఉందని అంటున్నారు. పరిస్థితి చేయిదాటకుండా ఉండేందుకు పొలం వద్ద నీటి ఆధారం ఉన్న రైతులు ట్యాంకర్లు, పంపులు, స్ప్రింక్లర్లు వంటి వాటితో విత్తనాలకు తడి అందిస్తున్నారు. నీటి వనరులు లేని రైతులు వర్షాధార సాగుపై ఆధారపడిన రైతులు నిత్యం ఆశగా ఆకాశంకేసి చూస్తూ, మేఘాలే దోబూచులాడుతుండడంతో ఆశ, నిరాశకు లోనవుతున్నారు. ఆరుగాలం కష్టాలు ఆదిలోనే మొదలయ్యాయని వాపోతున్నారు.

### వ్యవసాయశాఖ అంచనాలు ఇలా..

ఖరీఫ్‌లో జిల్లాలో 3,23,523ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలను సాగు చేస్తారని జిల్లా వ్యవసాయశాఖ అంచనాలు వేసింది. అందులో అత్యధికంగా పత్తి 85,379, వరి 1,70,45, మొక్కజొన్న 33,894, కంది 18,229ఎకరాలలో సాగు చేయనున్నారని అంచనా వేశారు. జూన్‌లో పంటల సాగు పనులు ముమ్మరంగా కావాల్సి ఉండగా ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటివరకు భారీ వర్షం నమోదు కాకపోవడం, ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో వారంలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవకపోతే మెట్ట పంటలు పత్తి, మొక్కజొన్న వంటివి చేతికి రాకుండా పోవడం ఖాయమని పలువురు రైతులు తెలిపారు. లేదంటే మరోసారి నాటుకోవాల్సిన పరిస్థితి వస్తుందని చెప్పారు. విత్తనాలు, ఎరువులు, కలుపు మందులు కొనుగోలు చేయాలంటే మరింత పెట్టుబడి అవసరం అవుతుందన్నారు. గత ఏడాదిలో కూడా తగినంత వర్షాలు కురవలేదు. దాంతో వర్షం చుక్క లేక రైతులు అల్లాడిపోతున్నారు. ఎండల తీవ్రత కొనసాగుతుండడంతో సాధారణ వర్షం చాలదని, భారీ వాన కురిస్తేనే ఉపయోగంగా ఉంటుందని అన్నదాతలు అంటున్నారు.

### పంటలు ఎండుతున్నాయి..



వానాకాలం ప్రారంభమైనా వర్షాల జాడలేకపోవడంతో సాగు చేసిన పత్తి, మొక్కజొన్న ఎండిపోతుంది. జూన్ మొదటి వారంలో కురిసిన కొద్దిపాటి వర్షానికి సాగు చేసిన పంటలు కొంతవరకు మొలకెత్తినా, మరికొంత మొలకెత్తలేదు. ఇప్పుడు ఆ మొలకలు వాడుముఖం పట్టాయి. ఈసారి వర్షాలు ముందుగానే కురవడంతో ఆశతో సాగుచేశాం. కానీ తీరా అవి మొలకెత్తే సమయంలోనే వాన కురవకపోవడం చాలా ఇబ్బందికరంగా మారింది. వేసిన విత్తనాలను బతికించుకునేందుకు సుమారు రూ.50వేలకు పైగా వెచ్చించి పైప్‌లైన్, స్ప్రింక్లర్లను పొలంలో ఏర్పాటు చేసి, నీరందించాను. కానీ పెట్టుబడి కూడా వచ్చేలా లేదు.

**– రవీందర్‌రెడ్డి, రైతు, కిష్టంపల్లి**



మాట్లాడుతున్న ఎంపీ మల్లు రవి

### గద్వాలను దత్తత తీసుకుంటా..

- నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి

గద్వాల, జూన్ 20 : విజయం సాధించిన వెంటనే గద్వాల నియోజకవర్గాన్ని దత్తత తీసుకుంటానని పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం దత్తత తీసుకొని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి పేర్కొన్నారు. గద్వాల నియోజకవర్గ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని, అభివృద్ధి విషయంలో ప్రజలకు సేవకుడిగా ఉంటానన్నారు. గద్వాల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఎంపీ మల్లురవికి సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతయ్య గజమాలతో సత్కరించారు. అక్కడి నుంచి జములమ్మ ఆలయానికి చేరుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి జిల్లా కేంద్రానికి ర్యాలీగా చేరుకొని బాబుజగ్జీవన్‌రాం, అంబేద్కర్, రాజీవ్‌గాంధీ, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండారి భాస్కర్, గట్టుతిమ్మప్ప, బండ్ల రాజశేఖర్‌రెడ్డి, గంజిపేట శంకర్, పద్మావెంకటేశ్వర్‌రెడ్డి, వరలక్ష్మీ వెంకటస్వామిగౌడ్, నల్లారెడ్డి, ఆనంద్‌గౌడ్, అమరవాయి కృష్ణారెడ్డి, మధుసూదన్‌బాబు, శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

### పేటకు మొదటిస్థానం

నారాయణపేట టౌన్, జూన్ 20 : పారామీటర్ల(సూచిక) వారీగా మే నెలకు సంబంధించి జిల్లాల పనితీరులో నారాయణపేట జిల్లా వ్యవసాయశాఖ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచినట్లు డీఏవో జాన్‌సుధాకర్ తెలిపారు. క్రాప్ బుకింగ్, పీఎం కిసాన్ ఈకేవైసీ, పీఎం కిసాన్ ఏబీపీఎస్, పీఎం కిసాన్ సెల్ఫ్ రిజిస్ట్రేషన్, పీఎం కిసాన్ స్టాప్ పేమెంట్స్ కరెక్షన్, రైతుబీమా, రైతుబీమా క్లెయిమ్స్, యూరియా రిపోర్ట్, ఎఫ్ఐవీఈఎస్ ఏపీపీ, ఓఎల్ఎంఎస్, ఏఈవో అటెండెన్స్‌కు సంబంధించి మొత్తం 11 అంశాల్లో 110 మార్కులకు గానూ 96.59 మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు.

# ఒకే నెంబర్‌తో రెండు ఆటోలు!



ఒకే నెంబర్‌తో ఉన్న రెండు ఆటోలు

మక్తల్, జూన్ 20: ఒకే రిజిస్ట్రేషన్ నెంబర్‌తో రెండు ఆటోలు మక్తల్ పట్టణంలో గురువారం కనిపించాయి. మక్తల్ బస్టాండ్ నుంచి ప్రయాణికులను చుట్టుపక్కల గ్రామాలకు చేరవేసేందుకు వీటిని వినియోగిస్తున్నారు. కానీ ఒకే నెంబర్‌ను రెండు ఆటోలకు ఎలా రిజిస్ట్రేషన్ చేశారంటూ స్థానికులు పలువురు చర్చించుకుంటున్నారు.

### ఉరేసుకొని యువతి ఆత్మహత్య

భూత్పూర్,జూన్ 20 : ఉరేసుకొని యు వతి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటన భూత్పూర్ మున్సిపల్ పరిధిలోని అమిస్తాపూర్‌లో చోటుకున్నది. గ్రామానికి చెందిన చైతన్య (16) యువతి గురువారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడింది. అనుమానస్పదంగా చైతన్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఇందుకు సంబంధించి ఎలాంటి వివరాలు తెలియలేదు.

### ఏటీఎం చోరీకి యత్నం

గద్వాల అర్బన్, జూన్ 20 : గుర్తు తెలియని వ్యక్తులు ఏటీయం చోరీకి ప్రయత్నిం చి విఫలమైన సంఘటన జోగుళాంబ గద్వా ల జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. టౌన్ ఎస్సై శ్రీనివాసులు కథనం మేరకు.. పట్టణంలోని పాత కూరగాయల మార్కెట్ సమీపంలో ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఏటీఎం సెంటర్‌లోకి గురువారం తెల్లవారుజామున దుండగులు చొరబడ్డారు. మిషన్‌ను ధ్వంసం చేసి నగదు అపహరణకు విఫలయత్నం చేశారు. ఎంతకీ డబ్బులు రాక పోవడంతో చివరకు అక్కడి నుంచి వెను దిరిగారు. ఉదయం సమాచారం అందుకు న్న ఎస్సై ఏటీఎంను పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్లు ఎస్సై వెల్లడించారు.

# ప్రైవేట్ దవాఖానలో మహిళ మృతి

- ఆందోళన చేసిన కుటుంబ సభ్యులు
- ఆగ్రహంతో వైద్యులు, సిబ్బందిపై దాడి, ఫర్నీచర్ ధ్వంసం



మహిళ బంధువులకు నచ్చజెబుతున్న పోలీసులు

మహబూబ్‌నగర్, జూన్ 20 : శస్త్రచికిత్స చేయగా.. రక్తస్రావంతో మహిళ మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్‌లో చోటు చేసుకున్నది. వైద్యుల నిర్లక్ష్యంతోనే మరణించిందన్న ఆగ్రహంతో కుటుంబ సభ్యులు దాడికి పాల్పడ్డారు. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం రావులపల్లి గ్రామానికి చెందిన జయశ్రీ(30) తీవ్ర కడుపునొప్పితో ఈనెల 17వ తేదీన మహబూబ్‌నగర్‌లోని ఎస్వీఎస్ దవాఖాకు వచ్చింది. పరీక్షించిన వైద్యులు ఆపరేషన్ చేయాలని దవాఖానలో అడ్మిట్ చేసుకొని బుధవారం శస్త్రచికిత్స చేశారు. గురువారం ఉదయం తీవ్ర రక్తస్రావం కావడంతో తీవ్ర అస్వస్థతకు గురై కొద్దిసేపటికే మృతి చెందింది. అయితే వైద్యులు సక్రమంగా వైద్యసేవలు చేయకపోవడంతోనే మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఆగ్రహంతో వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడి చేయడంతోపాటు దవాఖానలోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు వచ్చిన వారితో మాట్లాడి నచ్చజెప్పారు. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. దవాఖాన గైనిక్ డాక్టర్ సుధీర్‌ను వివరణ కోరగా.. జయశ్రీ ఆపరేషన్ చేయాలంటే హైరిస్కు అని వారి బంధువులకు ముందే సూచించామని చెప్పారు.

## వాణిజ్య

### ఇనోబ్యాట్‌లో పెరిగిన అమర రాజా వాటా

హైదరాబాద్, జూన్ 20: నార్వేకు చెందిన ఇనోబ్యాట్ ఏఎస్‌లో వాటాను మరింత పెంచుకున్నది అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ సంస్థ. కొత్తగా 4.5 శాతం వాటాను కొనుగోలు చేయడానికి 20 మిలియన్ల యూరోల (రూ.180 కోట్లకు పైమాటే) పెట్టుబడి పెట్టింది. దీంతో సంస్థలో అమర రాజా వాటా 9.32 శాతానికి చేరుకున్నది. గతంలో 10 మిలియన్ యూరోల పెట్టుబడి పెట్టిన విషయం తెలిసిందే.

# డాలర్ ముందు రుపీ వెలవెల

**ఒకానొక దశలో ఆల్‌టైమ్ లో.. 27 పైసలు క్షీణత**

**17 పైసలు పడిపోయి 83.61 వద్దకు • 2 నెలలకుపైగా కనిష్ఠానికి పతనం**


ముంబై, జూన్ 20: డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ 2 నెలలకుపైగా కనిష్ఠ స్థాయిని తాకింది. గురువారం ఫారెక్స్ మార్కెట్‌లో ఉదయం ఆరంభం నుంచే దేశీయ కరెన్సీ.. అమెరికా డాలర్ ముందు చతికిల పడుతూ వచ్చింది. ఈ క్రమంలోనే ఒకానొక దశలో ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయికీ పడిపోయింది. ఏకంగా 27 పైసలు దిగజారి మునుపెన్నడూ లేనివిధంగా 83.68 స్థాయికి వెళ్లింది. అయితే మళ్లీ కోలుకోవడంతో 10 పైసలు బలపడింది. చివరకు బుధవారం ముగింపుతో చూస్తే 17 పైసలు క్షీణించి 83.61 వద్ద స్థిరపడింది. ఈ ఏడాది ఏప్రిల్ 16న కూడా ఇదే స్థాయి వద్ద నిలిచిన విషయం తెలిసిందే.

**క్రూడ్ సెగ**

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరగడం.. రుపీని ప్రభావితం చేసింది. మిడిల్ ఈస్ట్ దేశాల్లో రాజకీయ, భౌగోళిక ఉద్రిక్తతలు.. క్రూడ్ రేట్లను ఎగదోశాయి. ఈ క్రమంలోనే దేశీయ స్టాక్ మార్కెట్లు పెరిగినా ఆ జోష్‌ను రుపీ అందుకోలేకపోయింది. విదేశీ పెట్టుబడులు ఈక్విటీల్లోకి వచ్చినా రుపీపై ఒత్తిడి తగ్గలేదని ఫారెక్స్ ట్రేడర్లు సైతం విశ్లేషిస్తున్నారు. నిజానికి ఉదయం ఆరంభంలో 83.43 వద్ద మొదలైన రుపీ.. ఒకానొక దశలో 83.42కు బలపడింది. బుధవారం 83.44 వద్ద ముగిసిన సంగతి విదితమే.

**ఇది కొనసాగితే..**

రుపీ నష్టాలు ఇదే స్థాయిలో కొనసాగితే దేశీయ దిగుమతులపై ఆ ప్రభావం పెద్ద ఎత్తున ఉంటుంది. ద్రవ్యోల్బణాన్ని ఎగదోసి.. దేశ ఆర్థిక వ్యవస్థనే చిక్కుల్లో పడేయగలదు. వాస్తవానికి ఆర్బీఐ.. రుపీ ట్రేడింగ్‌లో జోక్యం చేసుకుంటూనే ఉంటుంది. అయినప్పటికీ దేశ, విదేశీ పరిణామాలు షేక్ చేస్తూనే ఉన్నాయి. అయితే దేశంలో పెరుగుతున్న ఫారెక్స్ రిజర్వులు కొంతలో కొంత ఊరటగా చెప్పుకోవచ్చని మెజారిటీ నిపుణులు మాట.




### తెలుగు రాష్ట్రాల్లో జియో దూకుడు

హైదరాబాద్, జూన్ 20: టెలికం దిగ్గజం రిలయన్స్ జియో దూసుకుపోతున్నది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో తెలుగు రాష్ట్రాల్లో కంపెనీ నెట్‌వర్క్‌లోకి కొత్తగా 1.56 లక్షల మంది చేరారు. టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా 1,56,296 మంది నూతన సబ్‌స్క్రైబర్లు చేరడంతో మొత్తం సంఖ్య 3.29 కోట్లకు చేరుకున్నారు.

### ఓలా ఐపీవోకి గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ, జూన్ 20: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన సంస్థ ఓలా ఎలక్ట్రిక్..ఐపీవోకి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బహిరంగ మార్కెట్లో ప్రమోటర్లు, ఇన్వెస్టర్లకు చెందిన 9.52 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుండటంతో రూ.5,500 కోట్ల నిధులను సేకరించాలని సంస్థ సంకల్పించింది. దీంతోపాటు ఎంక్యూర్ ఫార్మాస్యూటికల్స్ ఐపీవోకి కూడా అనుమతినిచ్చింది. ఈ రెండు సంస్థలు గతేడాది డిసెంబర్‌లోనే దరఖాస్తు చేసుకున్నాయి.

### హైదరాబాద్‌లోకి సెంట్రీసిటీ


హైదరాబాద్, జూన్ 20: వెల్త్‌టెక్ స్టార్టప్ సెంట్రీసిటీ.. తాజాగా హైదరాబాద్‌లోకి అడుగుపెట్టింది. దక్షిణాది మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి సారించడంలో భాగంగానే హైదరాబాద్‌లో కొత్త కార్యాలయాన్ని గురువారం ప్రారంభించింది. ఇప్పటికే సంస్థకు దేశవ్యాప్తంగా ఎనిమిది చోట్ల కార్యాలయాలు ఉన్నాయి. ఈ నూతన ఆఫీస్ కోసం ప్రతిభ కలిగిన ఉద్యోగులను తీసుకునే పనిలో పడింది సంస్థ.

### ఎయిర్ ఇండియాతో జూమ్‌కార్ జట్టు

ముంబై, జూన్ 20: సెల్ఫ్ డ్రైవ్ కార్ షేరింగ్ ప్లాట్‌ఫాం సేవల సంస్థ జూమ్‌కార్..ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌తో జట్టుకట్టింది. ఇరు సంస్థల మధ్య కుదిరిన ఒప్పందంతో హైదరాబాద్‌తో పాటు 19 విమానాశ్రయాల్లో నేరుగా సెల్ఫ్–డ్రైవ్ కారును బుకింగ్ చేసుకునే వీలుంటుంది. విమానాశ్రయాల్లో దిగిన తర్వాత క్యాబ్ కోసం వేచి చూడాల్సిన అవసరం లేదని, ఎయిర్‌లైన్స్‌కు చెందిన మొబైల్ యాప్ ద్వారానే తమకు నచ్చిన కారును బుకింగ్ చేసుకునే వీలుంటుంది.

# స్విస్ బ్యాంకుల్లో తగ్గిన డిపాజిట్లు

**2023లో 70 శాతం దిగి రూ.9,771 కోట్లకు..**



న్యూఢిల్లీ, జూన్ 20: స్విస్ బ్యాంకుల్లో భారతీయులు, దేశీయ సంస్థల డిపాజిట్లు మరింత తగ్గాయి. వరుసగా రెండో ఏడాది 2023లోనూ స్విస్ బ్యాంకుల్లో డిపాజిట్లు 70 శాతం తగ్గి నాలుగేండ్ల కనిష్ఠ స్థాయి రూ.9,771 కోట్ల(1.04 బిలియన్ల స్విస్ ఫ్రాంక్స్)కు పరిమితమయ్యాయని స్విట్జర్లాండ్ సెంట్రల్ బ్యాంక్ విడుదల చేసిన వార్షిక నివేదికలో వెల్లడించింది. 2021లో 14 ఏండ్ల గరిష్ఠ స్థాయి 3.83 బిలియన్ల స్విస్ ఫ్రాంక్స్‌కి చేరుకున్న డిపాజిట్లు ఆ తర్వాత వరుసగా రెండేండ్ల పాటు తగ్గుముఖం పట్టడం విశేషం. బాండ్లు, సెక్యూరిటీ, ఇతర ఆర్థిక మార్గాల ద్వారా వచ్చిన పెట్టుబడుల ఆధారంగా సెంట్రల్ బ్యాంక్ ఈ నివేదికను రూపొందించింది. అయినప్పటికీ స్విట్జర్లాండ్‌లో భారతీయులు కలిగివున్న నల్లధనం ఎంత అనేది ఇప్పటికీ తెలియరాలేదు. ఇండియన్స్, ఎన్‌ఆర్‌ఐలు లేదా ఇతరులు స్విస్ బ్యాంకుల్లో ఇతర దేశాలకు చెందిన సంస్థల పేర్లతో పెట్టిన డిపాజిట్లను ఈ గణాంకాల్లో చేర్చలేదు. 2006లో రికార్డు స్థాయిలో 6.5 బిలియన్ల స్విస్ ఫ్రాంక్స్ డిపాజిట్లు ఉండగా, ఆ తర్వాతి తగ్గుముఖం పట్టాయని తన నివేదికలో వెల్లడించింది.

- 2020లో 39 శాతం పెరిగిన దేశీయ డిపాజిట్లు, 2021లో 8 శాతం అధికమవగా, 2022లో మాత్రం 18 శాతం తగ్గాయి.
- డిపాజిట్లలో బ్రిటన్ తొలిస్థానంలో నిలిచింది. 254 బిలియన్ల స్విస్ ఫ్రాంక్స్ డిపాజిట్లు కలిగివున్నది. ఆ తర్వాతి స్థానంలో అమెరికా(71 బిలియన్ల స్విస్ ఫ్రాంక్స్), ఫ్రాన్స్(64 బిలియన్ల స్విస్ ఫ్రాంక్స్) ఉన్నాయి.
- ఆ తర్వాతి స్థానాల్లో వెస్టిండీస్, జర్మనీ, హాంకాంగ్, సింగపూర్, లగ్జంబర్గ్ దేశాలున్నాయి.
- 2022లో 46వ స్థానంలో ఉన్న భారత్ ర్యాంక్.. ఈసారికిగాను 67వ స్థానానికి పడిపోయింది.
- మొత్తంగా 2022లో 1.15 ట్రిలియన్ స్విస్ ఫ్రాంక్స్‌గా ఉన్న డిపాజిట్లు 2023లో 983 బిలియన్ స్విస్ ఫ్రాంక్స్‌లకు తగ్గాయి.

### అన్‌సెక్యూర్డ్ లోన్లపై చర్యలుండాల్సిందే: ఆర్బీఐ

ముంబై, జూన్ 20: సంక్షోభాన్ని ముందే పసిగట్టి, దాన్ని అడ్డుకోవడానికి కృషి చేస్తున్నామని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. ఈ క్రమంలోనే అన్‌సెక్యూర్డ్ రుణాలపై ఆర్బీఐ చర్యలు తీసుకోకపోతే అవి పెద్ద సమస్యల్నే సృష్టిస్తాయని హెచ్చరించారు. గురువారం ఇక్కడి ఆర్బీఐ కాలేజ్ ఆఫ్ సూపర్‌వైజర్స్‌లో ఆర్థిక స్థితిస్థాపకతపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో దాస్ మాట్లాడారు. గత ఏడాది నవంబర్‌లో తీసుకున్న చర్య.. అన్‌సెక్యూర్డ్ రుణాలతో రిస్కును అడ్డుకున్నదని గుర్తుచేశారు. ఆర్బీఐ తీసుకున్న చర్యలతోనే క్రెడిట్ కార్డు పోర్ట్‌ఫోలియోల్లో వృద్ధి 30 శాతం నుంచి 23 శాతానికి తగ్గిందన్నారు. అలాగే బ్యాంకింగ్, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల్లో రిస్క్‌తో కూడుకున్న రుణాలు 29 శాతం నుంచి 18 శాతానికి దిగొచ్చిందని చెప్పారు.

### తగ్గిన ఎఫ్‌డీఐలు.. పడిపోయిన ర్యాంక్




న్యూఢిల్లీ, జూన్ 20: విదేశీ పెట్టుబడులు ఆకట్టుకోవడంలో భారత్ నిరాశాపరుస్తున్నది. 2023లో దేశంలోకి వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఏడాది ప్రాతిపదికన 43 శాతం తగ్గి 28 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. దీంతో వరల్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ర్యాంకింగ్‌లో భారత ర్యాంక్ 15వ స్థానానికి పడిపోయిందని ఐక్యరాజ్యసమితి కాన్ఫరెన్స్ ఆఫ్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్(యూఎన్‌సీటీఏడీ) తాజాగా విడుదలచేసిన నివేదికలో వెల్లడించింది. 2022లో భారత్‌లోకి వచ్చిన 48 బిలియన్ డాలర్లతో 8వ స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే.

### నేడు తైవాన్‌కు పరిశ్రమల శాఖ అధికారులు

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సాధ్యమైనన్ని ఎక్కువ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల పరిశ్రమలను నెలకొల్పడమే లక్ష్యంగా పరిశ్రమల శాఖకు చెందిన అధికారుల బృందం శుక్రవారం తైవాన్‌కు వెళ్లనున్నది. విదేశీ పెట్టుబడులు ఆకట్టుకోవడమే లక్ష్యంగా పరిశ్రమల శాఖకు చెందిన ఉన్నతాధికారులు అక్కడి ఎలక్ట్రానిక్స్ వస్తువుల తోపాటు చిప్‌ల తయారీ రంగానికి చెందిన సంస్థల ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీకానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రాయితీలపై ప్రధానంగా వివరించనున్నారు.

# ఇండ్లకు గిరాకీ నై

**హైదరాబాద్‌లో ఈ త్రైమాసికం 20 శాతం తగ్గొచ్చని అంచనా**



**ఏప్రిల్-జూన్‌లో 15వేల యూనిట్లకే పరిమితం**

**ప్రాప్‌ఈక్విటీ సంస్థ రిపోర్టులో వెల్లడి**

**దేనికి సంకేతం?**

ఇండ్ల అమ్మకాలపై ప్రాప్‌ఈక్విటీ పరిగణనలోకి తీసుకున్న నగరాల్లో ఒక్క హైదరాబాద్‌లోనే అత్యధికంగా డిమాండ్ పడిపోతున్నట్టు తేలడం గమనార్హం. నిజానికి ఎప్పుడూ హైదరాబాద్‌లో నివాసాలకు కొనుగోలుదారుల నుంచి పెద్ద ఎత్తునే ఆసక్తి కనిపించేది. కానీ ఈసారి అందుకు విరుద్ధంగా అంచనాలుండటం ఇప్పుడు మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. ఇక రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఇది మరింత హాట్ టాపిక్‌గా మారుతున్నది. నిజానికి గత పదేండ్లలో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ రంగ అభివృద్ధికి పెద్దపీట వేసింది. దీనికి తగ్గట్టుగానే మౌలిక వసతులను కల్పిస్తూ అనుబంధ రంగాలనూ ప్రోత్సహించారు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్. అలాగే నాటి ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ తీసుకున్న చర్యలూ కలిసొచ్చాయి. బడా సంస్థల రాకతో ఇండ్లకు డిమాండ్ ఏర్పడింది. అయితే కొత్త ప్రభుత్వం ఏర్పాటై 6 నెలలైనా.. రియల్టీపై ఫోకస్ పెట్టకపోవడమే ఇండ్ల అమ్మకాలను దెబ్బతీస్తున్నదన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

న్యూఢిల్లీ, జూన్ 20: గత ఏడాది వరకు హైదరాబాద్ ఇండ్ల కోసం ఎగబాడినవారంతా ఇప్పుడు సైలెంటైపోయినట్టు కనిపిస్తున్నది. ప్రముఖ రియల్ ఎస్టేట్ డాటా అనలిటిక్ సంస్థ ప్రాప్‌ఈక్విటీ అంచనాను చూస్తే ఇలాగే అనిపిస్తున్నది మరి. 10 రోజుల ముందుగానే ఈ ఏప్రిల్–జూన్ త్రైమాసికానికి సంబంధించి దేశంలోని 9 ప్రధాన నగరాల్లో ఇండ్ల అమ్మకాలపై ప్రాప్‌ఈక్విటీ ఓ నివేదికను తెచ్చింది. గురువారం విడుదలైన ఈ రిపోర్టు ప్రకారం ఈ నెలాఖరుతో ముగిసే 3 నెలల కాలంలో గతంతో పోల్చితే హైదరాబాద్‌లో హౌజింగ్ సేల్స్ భారీగానే తగ్గిపోతాయన్న సంకేతాలు వస్తున్నాయి. నిరుడు ఏప్రిల్–జూన్‌లో నగరంలో నమోదైన ఇండ్ల అమ్మకాలు 18,757 యూనిట్లుగా ఉన్నాయి. అయితే ఈసారి 15,016 యూనిట్లకే పరిమితం కావచ్చని ప్రాప్‌ఈక్విటీ లెక్కలు చెప్తున్నాయి. విక్రయాలు 3,741 యూనిట్ల మేరకు తగ్గుతాయని అంటున్నది. ఇది 20 శాతానికి సమానం.

- *గత ఏడాది ఏప్రిల్-జూన్‌లో దేశంలోని 9 నగరాల్లో 1,21,856 యూనిట్ల ఇండ్ల అమ్మకాలు జరిగాయి. అయితే 2 శాతం తగ్గి ఈ ఏడాది ఏప్రిల్-జూన్‌లో 1,19,901 యూనిట్లకే పరిమితం కావచ్చంటున్న ప్రాప్‌ఈక్విటీ.*
- *ఈ జనవరి-మార్చి అమ్మకాలతో చూస్తే 18 శాతం పడిపోనున్నాయి. నాడు 1,46,194 ఇండ్ల విక్రయాలు జరిగాయి.*
- *హైదరాబాద్, పుణెల్లో హౌజింగ్ సేల్స్‌కు డిమాండ్ లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని ప్రాప్‌ఈక్విటీ విశ్లేషించింది.*
- *మొత్తం 9 నగరాల్లో పుణె, హైదరాబాద్‌ల్లో మాత్రమే గతంతో పోల్చితే ఇండ్ల అమ్మకాలు క్షీణిస్తాయని ప్రాప్‌ఈక్విటీ చెప్తున్నది. అయితే బెంగళూరు, ముంబై, చెన్నైల్లో యథాతథం.*
- *నవీ ముంబై, కోల్‌కతాల్లో ఆకర్షణీయ వృద్ధి నమోదయ్యేందుకు వీలున్నది. థానె, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లలోనూ చెప్పకోదగ్గరీతిలోనే నివాస విక్రయాలు పెరగవచ్చు.*

**ఈ ఏప్రిల్-జూన్‌లో దేశంలోని ప్రధాన నగరాల్లో ఇండ్ల అమ్మకాల అంచనా**

| నగరం | 2023 | 2024 | వృద్ధి |
|---|---|---|---|
| థానె | 22,956 | 25,041 | 9% |
| పుణె | 26,586 | 22,482 | -15% |
| బెంగళూరు | 15,088 | 15,127 | – |
| **హైదరాబాద్** | **18,757** | **15,016** | **-20%** |
| ముంబై | 13,219 | 13,032 | – |
| ఢిల్లీ-ఎన్‌సీఆర్ | 9,635 | 10,198 | 7% |
| నవీ ముంబై | 6,640 | 9,035 | 36% |
| కోల్‌కతా | 4,025 | 5,130 | 23% |
| చెన్నై | 4,950 | 4,851 | – |